# బూట్లు

**చొక్కాపు వెంకటరమణ**


"పాసింజరు రైలెల్లిపోనాది"- ఎవరో అడిగి నట్లు తనలో తనే గొణుక్కున్నాడు సిమెంటు బెంచీమీద కూర్చున్న సిమ్మాద్రి.

అదో చిన్న రైల్వేస్టేషన్!

••••••

వెలివేసి దూరంగా తరిమివేసినట్టు ఆ ఊరికి మూడుకిలోమీటర్ల దూరంలో ఉందా స్టేషన్. చుట్టూ చెట్లు, పంట పొలాల మధ్య ఉన్న ఆ స్టేషన్ ఆకాశం నుంచి చూస్తే - ఆకుపచ్చకొలను మధ్య తెల్లకలువలా ఉంటుంది. దూరం నుంచి చూస్తే సిమెంటు కేకులాగ-దగ్గర్నుంచి చూస్తే కుంభకర్ణుడి సమాధిలాగ కనిపించే ఆ స్టేషన్‌కి అతి చిన్న ప్లాట్‌ఫాం ఉంది. దానిమీద ఒకేఒక సిమెంటు బెంచీ ఉంది.

రైలు వచ్చినప్పుడు తప్ప మిగతా సమయాల్లో ఆ సిమెంటు బెంచీమీద కూర్చుని కనిపించే సిమ్మాద్రి- ఆ సమాధిలోని కుంభకర్ణుడు ఎ[illegible]కైనా లేచి వస్తాడని ఏళ్ళ తరబడి ఆశగా ఎదురు చూస్తున్న అతని ఆత్మీయుళ్ళా



కనిపిస్తాడు.

ఆ స్టేషన్‌లో పాసింజరు రైళ్ళు తప్ప ఎక్స్‌ప్రెస్‌లు ఆగవు. నీరుకావి పంచెలవాళ్ళూ, మాసినబట్టలవాళ్ళూ, కూలిజనాలూ తప్ప సూటులవాళ్ళూ, బూటులవాళ్ళూ అక్కడ దిగరు. అక్కడ దిగిన రైల్లోంచి ఒక్కరు దిగితే ఇద్దరు ఎక్కుతారు. ఒక్కోరోజు ఎక్కేవారు, దిగేవారు అసలు ఉ[illegible]. ఎవరున్నా లేకపోయినా, సిమెంటు బెంచీ మీద సిమ్మాద్రి- బుకింగ్ కమ్ ఆఫీస్ గదిల్లో స్టేషన్ మాస్టర్ మాణిక్యం - తప్పనిసరిగా ఉంటారు. అది వాళ్ళ డ్యూటీ!

సిమ్మాద్రి సిమెంటు బెంచీ మీద కూర్చున్నాడు. అతని పక్కనే చుట్టిపెట్టిన ఎర్రజండా, పచ్చజండా ఉన్నాయి.

తన బతుకులోని కష్టాలను హరిత విప్లవంగా మార్చి, పోరాటం సలిపి అలసిపోయిన వృద్ధవిప్లవకారుడిలా ఉన్నాడు సిమ్మాద్రి. సిమెంటు బెంచీ కింద ఉన్న సిగ్నెలు లాంతరు దీపం. ముడుచుకు కూర్చున్న గిన్నికోడిలా ఉంది.

సిమ్మాద్రికి ఏభైఏళ్ళు పై నుంటాయి. కానీ డెబ్బయి ఏళ్ళవాడిలా కనిపిస్తాడు. అతని ముఖం పాత చెప్పులా లోతుగీతలతో నిండిపోయి ఉంటుంది. అతని నడుము ఎప్పుడూ వంగే ఉంటుంది. ఎముకలు తీసి తూస్తే ఏడు గ్రాములుంటాడు. కేవలం ఎముకతొక్కతో అతనొక ఎండిపోయిన చెట్టులాగున్నాడు. అతని చర్మం కూడా చెట్టు బెరడులా ఉంది.

అతని సన్నని కాళ్ళకి రెండేసి కిలోలబరువుండే పాత చెప్పులున్నాయి. సిమ్మాద్రి జీవితంలోని అనేక కష్టాల మజిలీల్లాగ - ఆ చెప్పుల్లో అనేక మేకులు కొట్టి ఉన్నాయి- అనేక కుట్లూ ఉన్నాయి. ఆ చెప్పులు పాతికేళ్ళనాటివైనా, వాటిని మ్యూజియంలో పెట్టి అశోకుడిపెదనాన్న వాడినవని చెపితే, టిక్కెట్టు కొని ఎగబడి చూస్తారు.

ఆ చెప్పులకున్నంత వయసున్న ఓ కొడుకున్నాడు సిమ్మాద్రికి. అతనిప్పుడిక్కడ లేడు. ఒక మలయాళీ అమ్మాయిని పెళ్ళాడి తండ్రికి దూరంగా దుబాయిలో సెటిలైపోయాడు.

తమ బతుకుల్ని దరిద్రపు ముళ్ళకంపలో నెట్టేసినందుకు రోజూ తిడుతూ ఉంటే- పూజించినా, పరుషంగా దూషించినా, ఒకేలా స్పందించే భగవంతుడు దొంగదెబ్బ తీస్తే- బతుకుని సెటిల్ చేసుకువెళ్ళిపోయింది సిమ్మాద్రి పెళ్ళాం.

సిమ్మాద్రి ఆ రైల్వే ఉద్యోగంలో చేరి ముప్పయిఏళ్ళయినా - మొదటిరోజు ఎక్కడున్నాడో ఇప్పుడూ అక్కడే ఉన్నాడు. అయితే తన సర్వీసులో అదే స్థాయిలో ఉన్న మూడు స్టేషన్లు మారేడు. మనిషి మాత్రం ఏమీ మారలేదు. అతని పరిస్థితులు మారలేదు. అతని చెప్పులు అసలు మారలేదు.

ఆ చెప్పులంటే సిమ్మాద్రికి ప్రత్యేకమైన ప్రేమ ఏమీలేదు. అతను చేస్తున్న ఉద్యోగం మీదా అంతే! ఉద్యోగం బతకటానికి అవసరం-చెప్పులు నడవటానికి అవసరం. అందుకే వాటిని వదిలేయాలని సిమ్మాద్రి ఏనాడూ అనుకోలేదు.

సిమ్మాద్రికి ఆ ఉద్యోగం మారాలనే ధ్యాసలేదు. అందుకే అన్నేళ్ళ నుంచీ ఎదుగూ బొదుగూ లేకపోయినా అలాగే నెట్టుకొస్తున్నాడు. కన్నకొడుకు చల్లని నీడలో సుఖంగా ఉండాలనే ఆశ సిమ్మాద్రికి లేదు. పసితనం నుంచీ తనని కష్టాల పెనం మీద వేసి వేయించినందుకు తనమీద కక్ష తీర్చుకొనేందుకే- అతను దూరంగా దుబాయ్ వెళ్ళిపోయాడని సిమ్మాద్రికి తెలుసు కాబట్టి. సిమ్మాద్రికి తన బతుకు మరింత ఆనందంగా గడపాలనే కోరికలేదు. అందుకే 'నా' అనేవారు లేకపోయినా, ఒంటరి పోరాటం సాగిస్తూ, చిల్లుపడిన బతుకునావను అలాగే నడిపించేస్తున్నాడు.

అలాగని అతనికేకోరికా లేదనుకోవడం పొరబాటు. అతనికున్న ఒకేఒక్కకోరిక - తను జీవితంలో ఒక్కసారైనా బూట్లు తొడగాలనీ, హుందాగా నడవాలనీ, వాటిని చూసుకొని మురిసిపోవాలనీను. ఆ కోరిక అతని వయసుతో పాటు పెరుగుతూ వచ్చింది.

సిమ్మాద్రికి వయసయితే పెరిగింది కానీ, బూట్లు వేసుకోవాలనే కోరికే తీరలేదు. ఆ ఆశ దినదిన ప్రవర్ధమానమై పెరిగి విశ్వరూపం దాల్చింది.

సిమ్మాద్రికి పసితనం నుంచీ బూట్ల మీద మక్కువ బలీయమైంది. అతను పుట్టగానే మాటలు వచ్చుంటే "బూట్లుకావాల"ని ఏడ్చి ఉండేవాడు. అతని తండ్రి సిమ్మాద్రిని వీధి బళ్ళో చేర్పించేరోజున "నాకు బూట్లు కొనిస్తేనే బడికెళ్తానని మారాం చేశాడు. చెరువు నీళ్ళల్లో చంద్రుణ్నిచూపించినట్లు - బాగా చదివితే బూట్లు కొనిస్తానని ఆశ చూపించి బడికి పంపేడు తండ్రి. సిమ్మాద్రి చదివే వీధిబడి గాలివానకి కూలిపోయి, అతని చదువు ఆ వరదల్లో కొట్టుకుపోయింది గానీ, బూట్లు మాత్రం తండ్రి కొనివ్వలేదు. ఆ జన్మలోనే కాదు - మరో ఏడు జన్మల్లో అయినా ఆ పేద తండ్రికి కొడుగ్గా పుడితే తనకు బూట్లు తొడిగే అదృష్టం అంటదని అర్థమయిపోయింది సిమ్మాద్రికి.

ఎవరో బూట్లు కొనిస్తారని ఆశలు పెట్టుకోవడం కంటే తన కష్టార్జితంతో అవికొనుక్కోవాలని నిర్ణయించుకున్న సిమ్మాద్రి చిన్న ఉద్యోగంలో చేరాడు.

మొదటి జీతం వచ్చినరోజు సిమ్మాద్రి ఆనందానికి అవధులు లేవు. ఆ జీతంలో కొంత డబ్బుతో తను బూట్లు కొనుక్కొని, తల్లికి ఓ చీర, తండ్రికి ఓ మంచి చొక్కా కొనాలని ఆలోచిస్తూ ఇంటికెళ్ళిన సిమ్మాద్రి - పాము కరిచి చచ్చిపోయిన తల్లి శవాన్ని చూసి షాక్ తిన్నాడు.

ఏ డబ్బుతో అయితే తను బూట్లు కొనాలనుకున్నాడో - ఏ డబ్బుతో అయితే తల్లికి చీర కొనాలనుకున్నాడో- ఏ డబ్బుతో అయితే తండ్రికి ఓ మంచి చొక్కాకొనాలనుకున్నాడో- ఆ డబ్బుతో తల్లి శవానికి ఘనంగా అంత్యక్రియలు జరిపించాడు సిమ్మాద్రి.

ఆ తర్వాత తనకొచ్చే జీతం రాళ్ళలోంచి బూట్లకోసం ఖర్చుపెట్టేందుకు రాళ్ళే తప్ప పైసా కూడా మిగల్చలేకపోయాడు సిమ్మాద్రి. అయినా రోజురోజుకీ బూట్ల మీద అతని కోరిక మరింత పెరగసాగింది. బూట్ల కాళ్ళ వాళ్ళెవరైనా కనిపిస్తే చాలు- కళ్ళప్పగించి చూస్తూ, కలల ప్రపంచంలో విహరించటం తప్ప సిమ్మాద్రికి వేరేదారి కనపడలేదు.

సిమ్మాద్రికి పెళ్ళి సెటిలయింది. ఆ రోజు కట్నాల ప్రస్తావనకు అడ్డొచ్చి - "నాకు కట్నంగిట్నం వద్దు. బూట్లు కొనివ్వండి....అదే నాకు కట్నం" అన్నాడు సిమ్మాద్రి.

పిల్లతండ్రి ముందు విస్తుపోయాడు. తర్వాత ఆనందపడి- 'సరే'నన్నాడు. అల్లుడి కోసం పట్నం నుంచి కొని తెచ్చిన బూట్లు బస్సులో మిస్సయిన సంగతి మావఁగారు పెళ్ళిపీటలమీద కూర్చున్న సిమ్మాద్రికి చెప్పేసరికి పెళ్ళిపందిరి కూలి తన తలమీద పడ్డట్టు ఫీలయ్యాడు. అప్పటి వరకు బుద్ధావతారంలా ఉన్న సిమ్మాద్రి ఆ విషయం విన్న మీదట నరసింహావతారం ఎత్తేసి, మావఁగారి పేగులు పీకేసి, పెళ్లికూతురి మెళ్ళో వేసేస్తానన్నాడు. అతని వాలకం చూసి సిమ్మాద్రి తండ్రి ముందు భయపడ్డాడు. ఆ తర్వాత బతిమాలేడు. పేగులు పీకినంత మాత్రాన బూట్లు రావన్నాడు. దానిక్కావలసింది ఓర్పు,డబ్బుగాని - కోపవూఁ పేగులూఁ...కావన్నాడు.

అలా వాయిదా పడిన సిమ్మాద్రి బూట్లు తొడగాలనే కోరిక, అతని కొడుక్కి ఉద్యోగం వచ్చేంత వరకూ తీరనే లేదు.

కొడుక్కి మొదటినెల జీతం వచ్చిన రోజున - "నాన్నా! నీకేం కావాలి?"అని అడిగితే - ఠక్కున "బూట్లు!"అన్నాడు సిమ్మాద్రి.

మూర్ఛవచ్చినంతగా ఆశ్చర్యపోయాడు కొడుకు.

"ఏవిఁటీ?"అన్నాడు మళ్ళీ.

"బూట్లు కావాలి!"గొణిగాడు సిమ్మాద్రి.

అప్పుడతను వినకూడని మాట విన్నట్టు ముందు ఆశ్చర్యపోయాడు. తర్వాత పదికప్పులొక్కసారే పగిలినట్టు పెళ్ళున నవ్వాడు.

ఏవిఁటీ, ఈ వయసులో నీకు బూట్లా?"అన్నాడు కొడుకు.

కొడుకు ముందు - పచ్చిబూతులు ఆడినవాళ్ళా సిగ్గుపడ్డాడు సిమ్మాద్రి. అయినా అతనిలోని ఆ కోరిక బలీయమైనది.


తన కోరిక విని వెకిలిగా నవ్విన కొడుకు...కొడుకులా కనిపించలేదు.

తనలో ఏళ్ళ తరబడి గూడుకట్టుకున్న ఆశల పావురాళ్ళ పీకలు నులిమిన కిరాతకుడిలా కనిపించాడు. తను రోజూ మొక్కుతుంటే పట్టించుకోకుండా ఒక్కసారిగా విరిగి మీద పడ్డ దేవుడి విగ్రహంలా కనిపించాడు.

సిమ్మాద్రి చివాల్న పైకిలేచి కొడుకు ముఖంలోకి చూశాడు.

"అవును బూట్లే...నువ్వు నాకు తలకొరివి పెట్టకపోయినా నానేవీఁ...అనుకోను. నా కాస్టంలో బూట్లు విసిరెయ్యి సాలు!" అంటూ అక్కణ్నుంచి విసురుగా వెళ్ళిపోయాడు సిమ్మాద్రి.

ఆ తర్వాత కొన్నాళ్ళకు కొడుకు దుబాయికి వెళ్ళిపోయాడు. వాడు చేసిన జల్సాల అప్పుల్ని తండ్రయిన పాపానికి తీర్చుకుంటూ వస్తున్న సిమ్మాద్రి తన బూట్ల కోరికని మనసులో నొక్కిపట్టుకున్నా అది తరచూ గొడవచేస్తూనే ఉంది.



సిమ్మాద్రి ఆలోచన్లలోంచి బైటపడి చుట్టూ చూసేసరికి చిమ్మచీకటిగా ఉంది.

"అబ్బో రేతిరి పదిగంటలు దాటిపోనాది"అనుకున్నాడు.

"ఎక్స్‌ప్రెస్ వచ్చే టయాం అయింది"గొణుక్కున్నాడు సిమ్మాద్రి.

**సూర్యుడు బద్ధకంగా ఒళ్ళువిరుచుకొని పడగ్గదిలోంచి బైటికొచ్చిన కొత్త పెళ్ళికొడుకులా ఉన్నాడు. నెత్తిమీద పాలతట్టలతో చేతులూపుకొంటూ గబగబా నడిచిపోతున్నారు పల్లెపడుచులు. పిట్టలు సుప్రభాతాలు పాడుకొంటూ గుంపులుగ్గా ఎగిరివెళ్తున్నాయి.**

'తన ఉద్యోగజీవితంలో తను పచ్చలైటు చూపించే చివరిట్రైను ఇది. రేపటినుంచి రిటైర్మెంటు జీవితం గడపాలి తను'అనుకున్నాడు.

పిలిస్తే వచ్చే చుట్టంలా దూరం నుంచి రైలు వస్తున్న చప్పుడు సిమ్మాద్రి చెవులకి లీలగా సోకింది.

మెల్లగా పైకి లేచాడు.

సిమెంటు బెంచీ కింద ఉన్న లాంతరు వెలిగించి ఆకుపచ్చ అద్దం ముందుకి తిప్పేడు.

"రోజూ రైళ్ళు వచ్చినప్పుడల్లా 'గ్రీన్ సిగ్నల్' చూపించే తనకు- ఉద్యోగం నుంచి విశ్రాంతి తీసుకునేందుకు 'గ్రీన్‌సిగ్నల్'చూపించింది వయసు. కానీ తనకు బూట్లు తొడుక్కోవాలనే కోరిక తీరేందుకు 'గ్రీన్ సిగ్నల్' ఎప్పుడో?" అనుకొని మెల్లగా ముందుకు అడుగులు వేశాడు సిమ్మాద్రి.

ఒంటికంటి చీకటిభూతంలా పెద్దగా శబ్దం చేస్తూ ఎక్స్‌ప్రెస్ రైలు వేగంగా దూసుకువచ్చి ముందుకి పరుగుతీసింది. ఏళ్ళ తరబడి అలవాటు పడినందువల్ల సిమ్మాద్రికి కనురెప్పకొట్టేలోగా మాయమయ్యే రైలైనా - ప్రతి రైలు బోగీ స్పష్టంగా కనిపిస్తుంది.

స్టేషన్ దాటి పిచ్చి కుక్కలా పరుగెడుతున్న ఎక్స్‌ప్రెస్ రైల్లోని ఒక బోగీలోంచి హఠాత్తుగా ఏదో వస్తువు ఎగిరి పడ్డట్టు కనిపించింది సిమ్మాద్రికి.

రైలెళ్ళిపోయింది. ఆ వస్తువు ప్లాట్‌ఫాంకి కాస్త దూరంలో పడింది. దగ్గరికెళ్ళి తన కళ్ళతో చూస్తేగాని మనసు కుదుటపడదు సిమ్మాద్రికి. లాంతరు పట్టుకొని అటువైపు పరుగులాంటి నడకతో వెళ్ళాడు.

రైలుపట్టాల పక్కన ఓ ఆకారం పడి ఉంది. అది మనిషిదని దూరం నుంచే అర్థమయింది సిమ్మాద్రికి. లాంతరు వెలుగు పెద్దదిచేసి చూశాడు.

మనిషే!

సిమ్మాద్రికి భయం వెన్నులోంచి చలిలా పుట్టుకొచ్చింది. ఆ చచ్చిన మనిషే దెయ్యమై వెంటపడినట్టు - "మాణిక్యెంగారో!" అని గావుకేక పెట్టి స్టేషన్‌వైపు పరుగుతీశాడు.

* * *

తెల్లారింది. సూర్యుడు బద్ధకంగా ఒళ్ళువిరుచుకొని పడగ్గదిలోంచి బైటికొచ్చిన కొత్త పెళ్ళికొడుకులా ఉన్నాడు. నెత్తిమీద పాలతట్టలతో చేతులూపుకొంటూ గబగబా నడిచిపోతున్నారు పల్లెపడుచులు. పిట్టలు సుప్రభాతాలు పాడుకొంటూ గుంపులుగా ఎగిరివెళ్తున్నాయి.

ఇవన్నీ పట్టించుకోకుండా పోలీసులు ప్లాట్‌ఫాంకు కాస్త దూరంలో రైలుపట్టాల దగ్గర గుంపుకూడి ఉన్నారు.

ఆ గుంపు మధ్య తల పగిలి, రక్తం గడ్డకట్టిన ఓ యువకుడి శవం ఉంది.

రెండుతలల వింత పశువుని చూస్తున్నంత ఆశ్చర్యంగా చూస్తున్నారు ఆ చుట్టూ చేరిన గ్రామస్తులు.

శవాన్ని పీక్కుతినటానికి వచ్చిన నక్కల్ని దూరంగా తరిమికొడుతున్న శవం తాలూకు బంధువుల్లా - కానిస్టేబుళ్ళు జనాన్ని దూరంగా లాఠీలతో తరుముతున్నారు.

ఇన్‌స్పెక్టర్ పట్టాల పక్కన పడున్న యువకుడి శవాన్ని పరిశీలిస్తూ, శవం మీది వస్తువుల్ని వరుసగా చెప్పుతున్నాడు. పక్కనే ఉన్న మరో పోలీసు ఉద్యోగి పాపాల పట్టిక రాసుకొంటున్న చిత్రగుప్తుడిలా - డైరీలో నోట్ చేసుకొంటున్నాడు.

"మెడలో బంగారుగొలుసు"

..........................

"తెల్ల టెర్లిన్ షర్ట్"

..........................

"కుడిచేతివేళ్ళకు మూడు బంగారుంగరాలు"

......................................

"గోల్డ్‌చైన్ రిస్ట్‌వాచ్"

..................

"బ్లాక్‌టెరీఊల్‌పాంట్"

..........................

"పర్స్‌లో అయిదువేల రూపాయలు"

..................................

"కాళ్ళకి రాయల్ బ్లూ సాక్స్"

..............................

"పాత చెప్పులు"

*